సాక్షి
వనపర్తి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు



వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 668 మందికిగాను 637 మంది హాజరయ్యారు. 31మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు డీఐఈఓ మద్దిలేటి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 458 మంది విద్యార్థులకుగాను 441 మంది హాజరయ్యారని.. 17 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. కాగా జిల్లా కేంద్రంలోని టీఎంఆర్‌జేసీ, సీవీ రామన్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈసీ సభ్యుడు ప్రకాశంశెట్టితో కలిసి డీఐఈఓ తనిఖీ చేశారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం




ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర గీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆత్మకూర్ మండలం రేచింతలలో ఆదివారం మాజీ జెడ్పీటీసీ బాలకిష్టన్నను పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు.

గృహజ్యోతికి కసరత్తు

లబ్ధిదారుల ఎంపికలో అధికారుల నిమగ్నం

- ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది
- జిల్లాలో చురుకుగా సాగుతున్న సర్వే
- ఇప్పటి వరకు 40వేల కనెక్షన్ల నమోదు



వనపర్తిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారి వివరాలు సేకరించేందుకు ఇంటింటి సర్వే చేపట్టింది. సంబంధిత అధికారులు, సిబ్బంది విద్యుత్ వినియోగదారుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను నిర్ధారణ చేసుకుంటున్నారు. విద్యుత్ వినియోగదారులకు ఈనెల బిల్లు ఇవ్వడంతో పాటు ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో సర్వే..

జిల్లాలో మొత్తం లక్ష 45వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. గృహ అవసరాలకు సంబంధించి లక్ష 24వేల కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకం అమలు చేసేందుకుగాను ప్రభుత్వం జిల్లాల వారీగా నోడల్ అధికారిని నియమించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి వివరాలను సైతం నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టింది. ఈమేరకు విద్యుత్ అధికారులు, సిబ్బంది బిల్లింగ్ మిషన్‌లో వినియోగదారుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 40 వేల విద్యుత్ కనెక్షన్ల వివరాలను నమోదు చేసుకోగా.. మరో నాలుగు రోజుల్లో 70 వేలకుపైగా కనెక్షన్ల వివరాలను నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు.

అద్దె ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు సైతం..

పట్టణాల్లో చాలా మంది అద్దె ఇళ్లల్లో నివసిస్తుంటారు. ఇంటి యజమాని పేరిట విద్యుత్ కనెక్షన్ ఉంటుంది. ఇలాంటి సమయంలో అద్దె ఇంట్లో ఉండే వారి రేషన్, ఆధార్ కార్డుల వివరాలను ఆ కనెక్షన్‌కు జోడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతు న్నారు. ఇదిలా ఉండగా ఇంటి యాజమాని మరణించిన ఇంట్లో ఉండే కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

అందుబాటులో ఉండాలి..

గృహజ్యోతి పథకానికి సంబంధించి విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నాం. విద్యుత్ మీటర్ వద్ద వినియోగదారుల వివరాలను ఏర్పాటుచేయాలి. లేదా సిబ్బందికి అందుబాటులో ఉండి వివరాలను తెలియజేయాలి. చాలా ప్రాంతాల్లో ప్రజలు అందుబాటులో ఉండకపోవడం ఇబ్బందిగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నాం. అద్దె ఇంట్లో నివసించే వారి వివరాలను కూడా నమోదు చేస్తున్నాం.

– నరేందర్‌కుమార్, విద్యుత్ శాఖ డీఈ, వనపర్తి

తెల్లరేషన్ కార్డుదారులే అర్హులు..

తెల్లరేషన్ కార్డు ఉన్న వారు మాత్రమే గృహజ్యోతి పథకానికి అర్హులుగా తెలుస్తోంది. ప్రస్తుతం సంబంధిత అధికారులు విద్యుత్ బిల్లు ఇవ్వడంతో పాటు వినియోగదారుల ఆధార్, తెల్ల రేషన్ కార్డు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. గతంలో కేవలం బిల్లు మాత్రమే వచ్చే మిషన్‌లలో.. వినియోగదారుల వివరాలు నమోదు చేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. ఈక్రమంలో మీటర్ వద్ద విద్యుత్ కనెక్షన్ నంబర్, రేషన్, ఆధార్, ఫోన్ నంబర్లు రాసి ఉంచాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ లెక్కన తెల్లరేషన్ కార్డులే ఈ పథకానికి అర్హులుగా తెలుస్తోంది.



విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

శరవేగంగా జూరాల రోడ్డు పనులు



చంద్రఘడ్ శివారులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు

రెండు రోజుల్లో 3 కి.మీ.రహదారి నిర్మాణం పూర్తి



ఆగుతూ.. సాగుతూ!

నత్తనడకన జూరాల రహదారి నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: జూరాల ప్రాజెక్టు రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. మరో రెండు రోజుల్లో రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు సంసిద్ధులయ్యారు. నిరంతరాయంగా రహదారి పనులు వేగంగా కొనసాగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పుష్కరాల సమయంలో పూర్తి కావాల్సిన రహదారి విస్తరణ పనులు.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, నిధుల విడుదలలో జాప్యం కారణంగా మరుగున పడ్డాయి. నత్తనడకన సాగుతున్న రహదారి పనులపై ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆగుతూ.. సాగుతూ' కథనంపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించారు. రహదారి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈమేరకు రహదారి విస్తరణ పనులను వేగవంతం చేశారు. రెండు రోజుల్లోనే 3 కి.మీ. రహదారి నిర్మాణం పూర్తిచేశారు. మరో రెండు రోజుల్లో రహదారి పనులను పూర్తిచేస్తామని పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

తీరనున్న వెతలు..

కొన్నేళ్లుగా జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మస్తీపురం క్రాస్‌రోడ్డు నుంచి కిష్టంపల్లి వరకు సుమారు 7 కి.మీ. రోడ్డు విస్తరణకు కృష్ణా పుష్కరాల సమయంలో రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. మొదట మస్తీపురం క్రాస్‌రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్.. నిధులు సరిపోవడం లేదని పనులను నిలిపివేశాడు. దీంతో మస్తీపురం, చంద్రఘడ్, నందిమళ్ల, కిష్టంపల్లి, నందిమళ్ల క్రాస్‌రోడ్డు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజల వెతలు తీరనున్నాయి.

సీఎంఆర్‌పై ప్రత్యేక దృష్టి

- ఈనెలాఖరు వరకు వందశాతం బియ్యం వసూలుకు చర్యలు
- రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు



పాన్‌గల్ రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

వనపర్తి/పాన్‌గల్: సీఎంఆర్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కనీస గ్యారంటీ లేకుండా రూ.కోట్ల విలువజేసే ధాన్యాన్ని మిల్లర్లకు కట్టబెట్టి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే పెండింగ్ సీఎంఆర్ సేకరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. అందులో భాగంగా గత జనవరి 31వ తేదీ వరకు సీఎంఆర్ గడువు ఇవ్వడంతో పెండింగ్ మొత్తంలో సగానికిపైగా బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు రాబట్టగలిగారు. మిల్లర్లకు మరో సారి ఛాన్స్ ఇస్తూ, ఈనెల 29 వరకు గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రికార్డుల ప్రకారం కేటాయించిన ధాన్యం, ఎస్‌సీఐకి అప్పగించిన బియ్యం, పెండింగ్ ధాన్యం బస్తాల వివరాలు సేకరించేందుకు పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ చీఫ్ కల్నల్ ప్రకాష్, విజిలెన్స్ ఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం శని, ఆదివారాల్లో జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో విస్తృత తనిఖీలు చేపట్టింది. 2021 ఖరీఫ్, యాసంగి సీజన్ల నుంచి తాజా ఖరీఫ్ సీజన్ వరకు బియ్యం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 146 మిల్లులు ఉండగా.. సగానికిపైగా మిల్లర్లు ఎస్‌సీఐకి బియ్యం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈనెలాఖరు నాటికి ఇవ్వాల్సిన పెండింగ్ బియ్యం 2,742 ఏసీకేలు ఇవ్వాలని ఆదేశించారు. గడువులోగా మిల్లర్లు బియ్యం ఎస్‌సీఐకి అప్పగించకుంటే ప్రభుత్వ ఆదేశానుసారం ఆర్‌అండ్‌ఆర్ యాక్ట్ అమలుచేసి, మిల్లర్ల ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

రైస్‌మిల్లుల్లో విస్తృత తనిఖీలు..

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పలు రైస్‌మిల్లుల్లో రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది. కొత్తకోట మండలం మిరాసిపల్లి శివారులోని ఇషాన్ ట్రేడర్, పాన్‌గల్ మండలం మహమ్మదాపూర్ శివారులోని మీనాక్షి ఫుడ్ ప్రొడక్షన్, జిల్లా కేంద్రంలోని కేదరనాథ్ రైస్‌మిల్, పాన్‌గల్ ఇషాన్ ఆగ్రో, పరమేశ్వర రైస్ మిల్లుల్లో తనిఖీలు చేసినట్లు వనపర్తి డీసీఎస్‌ఓ శ్రీనాథ్ వెల్లడించారు. ఇదివరకే ఈ మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మిల్లర్లు సకాలంలో ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకపోవడంతో పాటు మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం నిల్వల్లో సుమారు 2,25,179 బస్తాల ధాన్యం లోటు ఉన్నట్లు డీసీఎస్‌ఓ తెలిపారు.

ఎంపీడీఓల బదిలీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు ఎంపీడీఓలు బదిలీలు అయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 12 మంది ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఇందులో మంజుల గద్వాలకు, మున్ని రంగారెడ్డి జిల్లాకు, శ్రీనివాస్‌రెడ్డి సిద్దిపేటకు, ధనంజయగౌడ్ నారాయణపేట, టి.శ్రీనివాసులు నారాయణపేటకు, ఉమాదేవి గద్వాలకు, జయరాములు నారాయణపేటకు, జి.జ్యోతి నారాయణపేటకు, సాయిలక్ష్మి నారాయణపేటకు, కె.స్వరూప జయశంకర్ భూపాలపల్లికి, లక్ష్మీదేవి నాగర్‌కర్నూల్ జిల్లాకు, కిషన్‌రావు ఆసిఫాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. అలాగే జిల్లాకు వివిధ జిల్లాల నుంచి పలువురు ఎంపీడీఓలను కేటాయించారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కె.దేవన్న, కృష్ణయ్య, గీతాంజలి, కరుణశ్రీ, ప్రభాకర్ జిల్లాకు వచ్చారు. నారాయణపేట జిల్లా నుంచి కాళప్ప, బి.శ్రీనివాసులు, యశోదమ్మ, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి శరత్‌చంద్ర బాబు, బాల్‌రెడ్డి రానున్నారు. సిద్దిపేట జిల్లా నుంచి మచ్చేందర్ జిల్లాకు కేటాయించారు. వీరికి జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి మండలాలను కేటాయిస్తారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



జడ్చర్ల టౌన్: గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణం చేశారు. ఈ సందర్భంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మృత్సంగ్రహణం జరిపించారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పుట్టమన్ను తీసుకువచ్చి హోమగుండం నిర్మాణం అగ్నిప్రతిష్ఠ చేశారు. చెన్నకేశవనామస్మరణ మధ్య గ్రామవీధుల్లో స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. పుష్కరథం, రథోత్సవం వేడుకల కోసం రథాలను సిద్ధం చేస్తున్నారు.

అన్నదాతల ఆగ్రహజ్వాల

- అచ్చంపేటలో మరోసారి రోడ్డెక్కిన వేరుశనగ రైతులు
- ట్రేడర్లు కుమ్మక్కై తక్కువ ధర కేటాయించారని నిలదీత
- మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడికి యత్నం
- కార్యాలయం నుంచి చీరకొంగు పట్టి బయటకు లాక్కొచ్చిన మహిళలు
- కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం..



అచ్చంపేటలో చైర్‌పర్సన్‌ను చీర కొంగుపట్టి లాక్కెళ్తున్న మహిళా రైతులు

అచ్చంపేట రూరల్: 'ధర్నాలు, రాస్తారోకోలు చేసినా మా తీరు మారదు.. ఎవరెన్ని కష్టాలు పడినా.. ఎంత నష్టపోయినా.. మాకేం సంబంధం లేదు.. మేం నిర్ణయించిందే ధర.. వేరుశనగ పంట అమ్మితే అమ్మండి.. లేదంటే మీ చావు మీరు చావండి..' ఇదీ అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లోని ట్రేడర్ల తీరు. నాలుగు రోజుల వ్యవధిలో వేరుశనగ రైతులు రెండుసార్లు రోడ్డెక్కారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తక్కువ ధరకు పోతుంటే చూడలేక రైతులు ఆక్రోశం వెళ్లగక్కారు. తమ ఆవేదనను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహంతో రగిలిపోయారు. అచ్చంపేట ట్రేడర్ల తీరుతో వ్యవసాయ మార్కెట్ అధికారులు, చైర్‌పర్సన్‌పై దాడికి యత్నించి.. కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

■ ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, తమకు న్యాయం చేయాలని వేరుశనగ రైతులు ఆదివారం మరోసారి అచ్చంపేటలో రోడ్డెక్కారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, నూనెలకు మాత్రం ధరలు పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బుధవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ పంట రైతులు ధర్నా చేయడం, మరుసటి రెండు రోజులు గురు, శుక్రవారాలు మందకొడిగా రైతులు రావడం, శనివారం సెలవు ఉండటంతో ఆదివారం ఒక్కసారిగా భారీఎత్తున రైతులు పంటను తీసుకుని వ్యవసాయ మార్కెట్‌కు వచ్చారు. 709 మంది రైతులు 32,875 బస్తాల్లో 8,218.75 క్వింటాళ్ల వేరుశనగ తీసుకొచ్చారు. గరిష్టంగా రూ.7,060, కనిష్టంగా రూ.4,816లుగా మార్కెట్ అధికారులు ప్రకటించారు.

■ బుధవారం పలికిన ధర కంటే సుమారు క్వింటాల్‌కు రూ.300 తక్కువ పలికింది. దీంతో ఒక్కసారిగా కోపోద్రిక్తులై వ్యవసాయ మార్కెట్‌లోని చైర్‌పర్సన్ అరుణ కార్యాలయానికి ఆమెతో వాగ్వాదానికి దిగారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. చైర్‌పర్సన్‌ను చీర పట్టుకుని మహిళా రైతులు బయటకు లాగి వేరుశనగ కుప్పలపై పడేశారు. ఓ క్రమంలో ఆమెపై దాడికి యత్నిస్తుండగా సిబ్బంది వారించారు.

అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో..

అనంతరం వ్యవసాయ మార్కెట్ నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు చైర్‌పర్సన్‌ను మహిళా రైతులు లాక్కెళ్లారు. గతంలో రాస్తారోకో చేస్తే రైతులకు న్యాయం చేస్తామన్న పాలకవర్గం, అధికారులు తమకెలాంటి న్యాయం చేయలేదని వాపోయారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని రోజురోజుకు ధర తగ్గిస్తూ ట్రేడర్లు మోసం చేస్తున్నా ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వం, మార్కెట్ అధికారులు ప్రకటించిన ధర కంటే తమ పంటకు తక్కువ ఇచ్చారని ఆగ్రహించారు. ట్రేడర్లు ఇష్టానుసారంగా ధర నిర్ణయిస్తూ.. రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి ట్రేడర్లను అచ్చంపేటలోని స్థానిక ట్రేడర్లు రానివ్వడం లేదని ధ్వజమెత్తారు. సీఐ రవీందర్, ఎస్ఐ రాములు సంఘటనా స్థలానికి చేరుకుని రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు.

కవర్ల కోసం పరుగులు...

కాగా.. రాస్తారోకో అనంతరం వాతావరణంలో మార్పులు రావడం, చల్లని గాలి వీస్తుండటంతో వర్షం వస్తదేమోనని రైతులు కవర్ల కోసం పరుగులు తీశారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు రైతులకు సరిపడా కవర్లు అందజేశారు.

పట్టింపులేని ప్రజాప్రతినిధులు..

వారంలో రెండుసార్లు రైతులు గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కినా ఇప్పటి వరకు పాలకపక్ష, ప్రతిపక్ష నాయకులు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం సరైంది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై చైర్‌పర్సన్ అరుణ, ట్రేడర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

రీ టెండర్ వేస్తాం..

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. ఆదివారం మార్కెట్‌కు వచ్చిన ధాన్యానికి మరోసారి సోమవారం రీ టెండర్ వేస్తాం. ఇతర మార్కెట్ల కంటే అచ్చంపేటలోనే గరిష్ఠ, కనిష్ఠ ధరలు ఉన్నాయి. కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం.

– నర్సింహులు, మార్కెట్ కార్యదర్శి, అచ్చంపేట

ధరల తగ్గింపుపై ఆందోళన



మార్కెట్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

కల్వకుర్తి: వేరుశనగ రైతులు కన్నెర్రజేశారు. మార్కెట్‌లో రోజురోజుకూ ధరల పతనంపై ఆందోళనకు దిగారు. ఆదివారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి 3,685 క్వింటాళ్ల వేరుశనగను రైతులు తీసుకొచ్చారు. వారం రోజుల కిందట రూ.7,500 ధర పలికిన వేరుశనగ.. తాజాగా రూ.7,041కు చేరింది. అత్యధిక ధర రూ.7,041 వచ్చినట్లు మార్కెట్ సిబ్బంది చెబుతున్నప్పటికీ.. అది కొంతమంది రైతులకు మాత్రమే దక్కింది. దాదాపుగా రూ.6,101 నుంచి రూ.4,807 ధరలు వేశారు. దీంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మార్కెట్ కార్యాలయానికి పెద్దఎత్తున చేరుకుని ఆందోళన చేపట్టారు. వేరుశనగ ధర పెంచాలని.. వ్యాపారుల ఆగడాలు, అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. రైతుల ఆందోళనతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఎస్ఐ మాధవరెడ్డి రైతులకు నచ్చజెప్పారు. అధికారులతో మాట్లాడుదామని మార్కెట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. మార్కెట్ కార్యదర్శి భగవంతుతో మాట్లాడుతున్న క్రమంలో కొందరు రైతులు లోపలికి దూసుకొచ్చి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో మరో సారి రైతులు హైదరాబాద్ చౌరస్తాలో బైఠాయించి ఆందోళనకు దిగారు. రైతుల సమస్య తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అక్కడికి చేరుకొని రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. కాగా, అన్నదాతలు చేపట్టిన ఆందోళన ఫలించింది. వేరుశనగకు కొంత ధర పెంచేందుకు వ్యాపారులు అంగీకరించారు.

శ్రీనాథాచారి పుస్తకం ప్రపంచ ప్రసిద్ధి పొందాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత గిన్నిస్, లిమ్కా రికార్డుల గ్రహీత ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వంగీపురం శ్రీనాథాచారి రచించిన 'ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్ ' పుస్తకాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వశాంతిని కోరి శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం ప్రపంచ ప్రసిద్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో అనేక సమస్యలను తన పుస్తకంలో ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఇప్పటికే అనేక రికార్డులను సొంతం చేసుకున్న ఈ పుస్తకం గిన్నిస్ రికార్డు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆకాశవాణి రీడర్ డాక్టర్ సమ్మెట నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ సాహిత్య చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి గొప్ప పుస్తకం రాలేదన్నారు. ఈ పుస్తకాన్ని పది విభాగాలు రచించారన్నారు. సభాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ శ్రీనాథాచారి ప్రపంచ స్థాయి పుస్తకాన్ని రచించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. పుస్తక రచయిత వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ 30 ఏళ్ల అనుభవం, కఠోర దీక్షతో ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. ఇందులో ప్రపంచంలోని 197 దేశాల్లోని సమస్యలను కవితలలో ఆవిష్కరించినట్లు వివరించారు. ఈ పుస్తకం అమ్మగా వచ్చిన డబ్బులో ఐక్యరాజ్య సమితికి 50 శాతం, దేశానికి 25 శాతం, తెలంగాణకు 25 శాతం నిధులు చెల్లిస్తానన్నారు. ప్రపంచంలో అత్యంత ఖరీదైన పుస్తకం అని, త్వరలో అందరికీ అందుబాటులోకి తెస్తానన్నారు. పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, జగపతిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


దొడ్డి నిరంజన్ (ఫైల్)

గోపాల్‌పేట: విద్యుదాఘాతానికి గురై రైతు మరణించిన ఘటన రేవల్లి మండలంలోని నాగపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నాగపూర్ చెందిన దొడ్డి నిరంజన్ (50) మొక్కజొన్నపంట సాగు చేశారు. శనివారం ఉదయం ఇంటి నుంచి పొలం దగ్గరకు వెళ్లిన నిరంజన్ తిరిగి రాలేదు. ఆదివారం అతడి కుమారుడు పొలం దగ్గరకు వెళ్లి చూడగా మోటార్ స్టార్టర్ డబ్బా వద్ద షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ రిమాండ్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ పత్రాలు తారుమారు చేస్తున్నారనే అభియోగంతో మండలంలోని బొమ్మన్‌పల్లి మాజీ సర్పంచ్ బోడ్కనాయక్, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ హన్మంత్ నాయక్‌పై తహసీల్దార్ పాండు కేసు నమోదు చేయించిన సంఘటన తెలిసిందే. విచారించిన పోలీసులు మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు చేసి, జడ్జి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ హన్మంత్‌నాయక్‌పై కేసు నమోదైందని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం: కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ గోవర్దన్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డు శివారులో కోడిపందెం ఆడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. రూ.6,600 నగదుతో పాటు 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కోడిపందెం ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లేగదూడపై చిరుత దాడి

దామరగిద్ద: మండలంలో ఇటీవల అనారోగ్యంతో ఉన్న ఓ చిరుత చనిపోయిన ఘటన తెలిసిందే. తాజాగా శనివారం రాత్రి అడవిలో పశుల పాకలో కట్టేసిన లేడదూడపై చిరుత దాడి చేసి చంపిన ఘటన చోటు చేసుకుంది. ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గడ్డమీది హన్మంతు తన పొలంలో రెండు కాడెద్దులతో పాటు పాడి ఆవు, రెండు లేగ దూడలను పాకలోకట్టి ఉంచాడు. అర్ధరాత్రి అడవి పందులను వెంటాడిన చిరుతపులికి లేగదూడ కంట పడటంతో పశువుల పాకలో కట్టేసి ఉంచిన లేగదూడను చంపి తినేసింది. ఫారెస్ట అధికారులు పరిశీలించి చిరుతపులి తినేసి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. రైతులు తమ పశువులను ఇళ్ల దగ్గర ఉంచుకోవాలని చిరుత ఆనవాళ్లు తెలిసిన వెంటనే తమకు సమాచారం అందిస్తే పట్టుకునేందుకు అధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటామన్నారు. చిరుత ఒకే చోట ఉండటం లేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతు వివరాలను ఉన్నతాధికారులకు అందించి ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని సెక్షన్ ఆఫీసర్ తెలిపారు.

ఇంట్లో బంగారం, వెండీ చోరీ



దేవరకద్ర రూరల్: తాళం వేసిన ఇంట్లో బంగారం, వెండిని ఎత్తుకెళ్లిన ఘటన శనివారం రాత్రి పెద్ద గోప్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోప్లాపూర్ చెందిన తిమ్మన్న జీవనోపాధి కోసం గ్రామంలోని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి ముంబైకి వెళ్లాడు. గమనించిన దొంగలు శనివారం అర్ధరాత్రి తాళం విరగొట్టి, బీరువాలో నుంచి రూ. 2 లక్షల విలువ గల బంగారం, 30 తులాల వెండి ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. వీటితో పాటు ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు, వాటికి సంబంధించిన స్టోరేజ్ బాక్స్‌ను సైతం ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీంతో పాటు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. మహిళల జట్టుకు రోజ, సంధ్య, అనూష, సంధ్యకుమారి, లక్ష్మి, సమీన, సరిత, నందిని రజిత, మౌనిక తదితరులు ఉన్నారు. పురుషుల జట్టుకు ఉమాశంకర్, ప్రవీణ్, అశోక్, శివకుమార్, అభిలాష్ ఎంపికయ్యారు. ఎంపికైన వరాఉ ఈనెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ జిల్లా రేకుర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పీఈటీ శంకర్ నాయక్ తెలిపారు.

బ్యారేజీలు ప్రతిపాదనలకే పరిమితం

- నదులపై బ్యారేజీలు నిర్మించాలని పరివాహక ప్రజల డిమాండ్
- అవకాశం ఉన్నా ప్రభుత్వం దృష్టి సారించడం లేదని విమర్శ
- మిగులు జలాలు వాడుకుంటే ఎంతో లాభం


కృష్ణా, భీమానదుల సంఘమ ప్రాంతం


కుసుమర్తి వద్ద ఉన్న భీమా నది

కృష్ణా: భీమా, కృష్ణా, తుంగభద్ర నదులపై అవకాశం ఉన్నచోట ఎక్కడికక్కడ మినీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కొంత కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నదులపై బ్యారేజీల నిర్మాణానికి కృషి చేయాలని, ప్రధానంగా భీమా నదిపై ఓ ప్రాజెక్టు నిర్మించాలని ఈ ప్రాంత నదీతీర ప్రాంత రైతులు కోరుతున్నారు.

1987లోనే ప్రాజెక్టు కోసం తీర్మానం

1987–88లో రాష్ట్రంలో రాజకీయ పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం భీమా ప్రాజెక్టు నిర్మించాలని, మహబూబ్‌నగర్ జిల్లాకు సాగు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో అధికారికంగా నిర్ణయం తీసుకుని, ఆ తర్వాత ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఆ ప్రాజెక్టు చేపట్టకపోవడంతో ప్రభుత్వం ప్రత్యమ్నయంగా నదితీరాల్లో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను చేపట్టింది. ఆ తర్వాత పెండింగ్ భీమా ప్రాజెక్టు నిర్మించాలని బీజేపీ నాయకులు కృష్ణా మండల కేంద్రం నుంచి ఎడ్లబండ్ల యాత్రను అప్పట్లో చేపట్టారు. కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం అదే భీమానదిపై చిన్నపాటి బ్యారేజి నిర్మించాలని కొంతకాలంగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మిగులు జలాలపై దృష్టి

ప్రభుత్వం 10 టీఎంసీల మిగులు జలాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే ఏకైక మార్గం భీమానదిపై బ్యారేజి నిర్మించాలి. అందుకు గతంలో సాగునీటిశాఖ అధికారులు ఓ ప్రణాళికలను రుపొందించారు. ఆ ప్రతిపాదనలు కేవలం ఏరియల్ సర్వే వరకే నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ ఆ విషయంపై సాగునీటి శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని నదీతీర ప్రాంత రైతులు కోరుతున్నారు.

నీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఇప్పుడున్నా నదులుపైన నిర్మించిన ప్రాజెక్టులు అన్ని కూడా తెలంగాణ దిగువన ఏర్పాటు చేశారని, దీని మూలంగా సాగునీరు ఈ ప్రాంత ప్రజలకు అందకుండగా నష్టపోయినట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా నదుల నీటిని ఏ విధంగా వాడుకోవాలనే విషయంపై పూర్తి స్థాయిలో అవగాహన లేకుండగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కేవలం 55వేల క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లాలి. కానీ అందుకు విరుద్ధంగా లక్ష క్యూసెక్కుల నీటిని తీసుకెళ్తున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అది చట్టవిరుద్ధమని వారితో వాదిస్తుంది. కానీ తెలంగాణ నుంచి దిగువకు నీరు చేరకముందే మనం అవసరమైన నీటిని ఉపయోగించుకోనే అవకాశం ఉన్నా.. చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం జూరాల పైభాగంలో ఎక్కడనైన ప్రాజెక్టులు నిర్మించి ఉమ్మడి పాలమూరు ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మిగులు జలాలను వాడుకుంటాం



తెలంగాణ ప్రాంతానికి 10 టీఎంసీల నీటిని మిగులు జలాలను వాడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. భీమానదిపై ప్రాజెక్టు విషయంపై నీటిపారుదల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేయడంతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులను తొలగిస్తాం. ఇప్పటికే మాగనూర్ వాగుపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు ఏర్పాటు చేసి, రైతులకు సాగునీటిని అందించేందుకు ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే వాటి పనులు కూడా మొదలు పెడుతాం.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

ఆనకట్టలు ఉంటే నీటి ఇబ్బందులు రావు



ఎగువన ఉన్న కృష్ణా, భీమా నదులపై చిన్నపాటి ఆనకట్టలు, చెక్‌డ్యాంలు ఉన్నట్లయితే దిగువన ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీటి ఇబ్బందులు తొలుగుతాయి. కర్ణాటకలో ఎక్కడికక్కడ బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మించడం వల్ల అక్కడి రైతులకు రెండు పంటలకు అవసరమైన సాగునీరు అందుతుంది. వారికి వేసవిలో నదిలో నీళ్ల లేకపోయిన ఆ బ్యారేజీ నీటిని వాడుకుంటారు. మనకు నదిలో నీళ్ల ఉంటే తప్ప పంటలు పండవు. ఈ ఇబ్బందులు తొలగాలంటే మనం కూడా కర్ణాటక వలే కృష్ణా, భీమా నదులపై ఆనకట్టలు కట్టాలి. అప్పుడే సాగునీటికి ఇబ్బందులు తొలుగుతాయి. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశాం.

– నారాయణ, గుడెబల్లూర్

30ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



భీమా నదిపై ప్రాజెక్టును నిర్మించాలని 30ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు నిర్మిస్తే రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఉండవు. దాంతో మా ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని ఆశిస్తున్నాం. కానీ ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నారే తప్పా సాగునీటి ఇబ్బందులు తొలగడం లేదు. ఇప్పుడున్న ప్రభుత్వమైన మా బాధలను అర్థం చేసుకుని ప్రాజెక్టును నిర్మిస్తే మాకు కష్టాలు ఉండవు.

– ప్రతాప్, రైతు, కుసుమర్తి

భర్తపై పెట్రోల్ పోసి తగలపెట్టిన భార్య

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

మహబూబ్‌నగర్ క్రైం: తాగుడుకు బానిసై కుటుంబ వ్యవహారాలు పట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఓ భార్య భర్తపై పెట్రోల్ పోసి తగలపెట్టింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ఎండీ కాశీం టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. 20ఏళ్ల కిందట హసినా బేగంను రెండో పెళ్లి చేసుకోగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా ఈయన తాగుడుకు బానిసై, సంపాదన లేకుండా భార్యాపిల్లలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం భార్య హసిన బేగం బాటిల్‌లో పెట్రోల్ తీసుకువచ్చి అతనిపై పోసి తగలపెట్టింది. దీంతో 28శాతం గాయాలు అయిన కాశీంను చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిక్కినట్లే చిక్కి.. తప్పించుకున్న వాహనం

గట్టు: అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ బులెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నం చివరికి తప్పించుకున్న ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, పెంచికలపాడు నుంచి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని ఓ బులెరో వాహనంలో తరలిస్తున్న సమాచారం పోలీసులు అందుకున్నారు. దీంతో గట్టు, మల్దకల్ రోడ్డులోని ఆరగిద్ద స్టేజీ నుంచి గట్టు వైపు వస్తున్న బులెరో వాహనాన్ని పోలీసులు వెంబడించారు. గట్టు పెట్రోల్ బంకు నుంచి రాయాపురం, ఆలూరు, తుమ్మలచెరువు, మార్లబీడు వరకు వెంబడించారు. మార్లబీడు దాటిన తర్వాత ధరూరు వైపునకు కాకుండా మధ్యలో ఓబులోనిపల్లెలో బియ్యాన్ని తరలిస్తున్న బులెరో వాహనం చేరుకుని తప్పించుకున్నట్లు తెలిసింది. అయితే పోలీస్ వాహనం కూడా ఓబులోనిపల్లెకు చేరుకున్నప్పటికి వాహనం మాత్రం పోలీసులకు చిక్కలేదు.

చరిత్రకు సాక్ష్యాలు.. ఈ ఆలయాలు

- గుంత, మిట్ట రామలింగేశ్వస్వామి ఆలయాల్లో నిత్య పూజలు
- వనవాస కాలంలో శివలింగాలను ప్రతిష్ఠించిన సీతారాములు
- చాణక్య రాజుల కాలంలో ఆలయాల నిర్మాణం
- రూ.2 కోట్ల విరాళాలతో పునఃనిర్మాణం..
- నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు.. మంత్రాలయ పీఠాధిపతుల రాక


చాణక్య రాజు నిర్మించిన మిట్ట రామలింగేశ్వ్ర స్వామి ఆలయం (ఫైల్)

అయిజ: చాణక్య రాజుల కాలంలో నిర్మించిన గుంత రామలింగేశ్వర, మిట్టరామలింగేశ్వరస్వామి ఆలయాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచాయి. సీతారాముల వారు ప్రతిష్ఠించిన శివలింగాలు నేటికి భక్తులతో పూజలందుకుంటున్నాయి. శ్రీరాముడు అయోధ్య నుంచి బలుదేరిన నాటినుంచి వనవాసం పూర్తయ్యేవరకు యావత్ భారతదేశంలో ఎన్నో శివలింగాలను ప్రతిష్ఠించారు. ఇదే సమయంలో అయిజలోనూ ప్రతిష్ఠించారు. అయితే, శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం గుంతలో (పల్లపు ప్రాంతంలో) ఉండడం వలన గుంతరామలింగేశ్వర ఆలయంగా, సీతమ్మ వారు ప్రతిష్ఠించిన శివలింగం ఎత్తయిన ప్రదేశంలో ఉండడంతో మిట్టరామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరుగాంచాయి.

చాణక్య రాజుల పాలనలో నిర్మాణం

చాణక్య రాజులు అయిజ ప్రాంతాన్ని పరిపాలించిన సమయంలో సీతారాముల వారు ప్రతిష్ఠించిన శివలింగాలకు ఆలయాలను నిర్మించారు. ఆనాటి కాలం నుంచి శివాలయం సమీపంలో జాతర, రథోత్సవం నిర్వహించేవారు. మేలు రకం వృక్షాలతో వడ్రంగిలు రథాన్ని, మట్టితో బురుజును నిర్మించగా కాలక్రమేనా నేలమట్టమైంది. చాణక్య రాజులు నిర్మించిన శివాలయాలను మాత్రం నేటికి భక్తులు సందర్శించి పూజలు నిర్వహిస్తున్నారు.

ఆలయం పునఃనిర్మాణం

గుంత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల నుంచి విరాళాలు సేకరించి రూ.2 కోట్లు ఖర్చుపెట్టి పునఃనిర్మించారు. ఆలయంలో నూతనంగా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్మాణం చేపట్టారు. వినాయకుడు, బ్రమరాంభిక, కార్తికేయుడు, సత్యనారాయణ స్వామి, అయిదు అడుగుల ఎత్తయిన మహా నంది, రాఘవేంద్ర స్వామి, నవగ్రహాల ప్రతిష్ఠించనున్నారు. ఈనెల 12 నుంచి 14 వరకు మంత్రాలయం పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థులచే శాస్త్రోక్తంగా పూజలు చేయించి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి, ఆలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు

వేదపండితుల ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించనున్నారు. సోమవారం గంగపూజ, పుణ్యాహవచనము, నవగ్రహ ఆరాధన, షొడశస్తంభ పూజ, ప్రధాన దేవత ఆరాధన, జపాలు, అభిషేకాలు, మహా మంగళ మారతి నిర్వహించనున్నారు. మంగళవారం చండీ హోమం, రుద్ర హోమం, బుధవారం ఉదయం 10.17 గంటలకు రేవతి నక్షత్ర యుక్త మేష లగ్నమందు మంత్రాలయం పీఠాధిపతుల చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠలు బింబన్యాసం, కళాన్యాసం, కక్ష్యాగ్ని జ్వాల, బలిదానం, పూర్ణాహుతి మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం

బహిరంగ ప్రకటన

దిగువ తెలిపిన విధంగా తెలంగాణ, మహబూబ్ నగర్ జిల్లా, రాజాపూర్ గ్రామం & మండలం వద్ద గల వ్యవసాయ భూములను శ్రీమతి షంషున్నీసా బేగం భర్త మఖ్బూల్ హుస్సేన్ అలియాస్ మహమ్మద్ మఖ్బూల్ హుస్సేన్ మరియు జమ్మలి చంద్రయ్య తండ్రి నాగయ్య నుండి కొనుగోలు చేయుటకు నా క్లయింట్ భావిస్తున్నారని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది :

పట్టాదారు పేరు	సర్వే నం.	విస్తీర్ణం ఎ–గుం
శ్రీమతి షంషున్నీసా బేగం	263/అ3	0–21
భర్త మఖ్బూల్ హుస్సేన్ అలియాస్ మహమ్మద్ మఖ్బూల్ హుస్సేన్	263/అ1	0–22
జమ్మలి చంద్రయ్య తండ్రి నాగయ్య	258/అ	1–33 (ఎ3–06 గుంటలలో)

ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు సదరు తెలిపిన ఆస్తిలో ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా ప్రయోజనాన్ని కలిగి ఉన్నట్లయితే, వారు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించవలెను, లేనట్లయితే నా క్లయింట్ అట్టివాటి పేరున సేల్ డీడ్ నమోదుతో ముందుకు కొనసాగుతారు. ఆ తరువాత ఎటువంటి అభ్యంతరాలు లేదా క్లెయిమ్‌లు లేదా ఏవైనా స్వీకరించబడవు.

సం/- G.V. మల్లికార్జునరావు, అడ్వకేట్
[illegible], సనత్‌నగర్, హైదరాబాద్
సెల్ : 9666137063

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

మహబూబ్‌నగర్, అప్పన్నపల్లి ఫోర్డ్ షోరూం వెనకాల మెయిన్ రోడ్డుకు అతి దగ్గర్లో సొంత బోర్లు కలిగిన 30 ఫీట్ రోడ్డు గల ఈస్ట్ ఫేస్ 100 గజాలు, వెస్ట్ ఫేస్ 165 గజాలు గల కొత్త ఇండ్లు తక్కువ ధరలో అమ్మకానికి కలవు. సంప్ర: 8074183191, 95428 89989. [J-1016]

EDUCATION

One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 8515380685, 9032284760 [H-801585]

SERVICES

రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం,తక్కువవడ్డీ రేటు,సిబిల్అవసరంలేదు, NPAమూడా దరఖాస్తు చేసుకోవచ్చు,ఏజెంట్స్ కావలెను. ఆర్యన్ ఫైనాన్స్, పాస్తిరా. 7627832084. [T-229]

WANTED

డైరెక్ట్ జాబ్ 18–30 సం॥ మహిళలు / పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం, భోజనం డ్రైవర్లు, మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం 20,000/-. ఫోన్ 8886788005. [HA-10849]

Sales & Service Engineers, Qly: Dip. Electronics & B.Sc Electronics/ Any Degree. Divis Medical Systems, Vja, Hyd ✆ 9885327399/ 8498968592 [B-1264584]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజర్

ఆధునిక వ్యవసాయం-లాభాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్


రొటోవేటర్

అలంపూర్: వాతవరణంలో మార్పులు, తగ్గుతున్న భూగర్బ జలాలు, కూలీల కొరత, పెట్టుబడుల పెరుగుదల, తగ్గుతున్న భూసారం వంటి సమస్యలతో పంట సాగులో రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. ఆధునిక, శాస్త్రీయ సేంద్రియ పద్ధతులు పాటించి సాగుకు సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే లాభ సాటిగా మారుతుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. వీటిని అధిగమించడానికి ఎరువులు, విత్తనాలు వేసే సీడ్ డ్రిల్ వంటి పరికరాలు, వరి నాటు యంత్రాలు, దుక్కి చేసే రోటోవేటర్స్, పురుగుల మందు పిచికారి కోసం ట్రాక్టర్ స్ప్రేయర్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి వినియోగంతో రైతులు సాగు వ్యయాన్ని తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.

మిశ్రమ పద్ధతులకు ప్రాధాన్యం

రైతులు సాధారణ పంటలతోపాటు ఉద్యానవన పంటలు, పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టాలి. దీని వలన రైతులకు ఒక విధంగా కలిసిరాకున్న మరోక రంగంలో కలిసి వస్తోంది.

అంతర్ పంటకు పెద్దపీట

ఒకే రకమైన పంటను కాకుండా అంతర పంటలను సాగు చేసుకోవాలి. దీర్ఘకాలిక పంటల్లో స్వల్పకాలిక పంటలను అంతర పంటలను సాగు చేయాలి. దీని వలన భూసారం పెరగడమేకాక రైతులకు ఖచ్చితమైన ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

నాణ్యమైన విత్తనాలు

విత్తనాల కోసం ఊరు, పేరు లేని విత్తనాలపై ఆధారపడరాదు. నాణ్యమైన విత్తనాలను సేకరించుకుని రైతులే విత్తనాలను తయారు చేసుకోవాలి. దీంతో మీతోపాటు తోటి రైతులకు సహాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

తక్కువ నీటితో ఎక్కువ సాగు

సాగునీటిని ఆదా చేసే డ్రిల్, తుంపర సేద్యం పరికరాలను వాడాలి. దీంతో తక్కువ నీటితో ఎక్కువ ఎకరాల్లో పొలం సాగు చేసుకోవచ్చు.

మార్కెట్ ధరలపై అవగాహన

రైతులు మార్కెట్ ధరలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలి. దినపత్రికల్లో వచ్చే మార్కెట్ ధరలను పరిశీలించి రైతులు అమ్మకాల్లో తగు చర్యలు తీసుకోవాలి.

వాతావరణంపై సమాచారం

వ్యవసాయ పరిశోధన స్థానాలు ఉన్న చోట వారానికి రెండు, మూడు రోజులు ముందస్తు వాతావరణ సలహాలను అందిస్తున్నారు. వీటి ఆధారంగా వ్యవసాయ పనులు చేపట్టాలి.

వ్యవసాయ వార్తలపై దృష్టి

దినపత్రికలు, మీడియాలో వచ్చే వ్యవసాయ వార్తలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. దీని వలన వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు లభిస్తాయి. వ్యయంలో ఎదుర్కొంటున్న సమస్యలకు కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చు. వ్యవసాయ శిక్షణ తరగతులు, మేళాలు, ప్రదర్శనలు ఎక్కడ జరిగిన వెళ్లి అవగాహన పెంచుకోవాలి. ఇతర రైతులతో ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులపై చర్చించి వారి నుంచి విలువైన సమాచారం పొందాలి.

అలరించిన 'ఘంటసాల' గానలహరి


ఘంటసాల మధుర గీతాలను ఆలపిస్తున్న ఔత్సాహిక గాయకులు

గద్వాల: ఘంటసాల పాడిన మధుర గీతాలు ఆహుతులను అలరించాయి. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్థానిక వేదనగర్‌లోని దయానంద విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన 'నా కంటి పాపలో నిలిచిపోరా...' పేరుతో అలనాటి సినీ పాటల ఆర్కెస్ట్రా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి కళాభిమానులు, వ్యాపారులు, పట్టణ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'నా హృదయంలో నిదురించే చెలి..', 'నడిరేయి ఏ ఝాములో..',జయమ్ము నిశ్చయమ్మురా..', 'తొలి వలపే పదే పదే..', ' తెల్లచీర కట్టుకున్నది ఎవరి కోసము..' అంటూ ఔత్సాహిక గాయకులు ఆలపించిన పాటలు అలనాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చాయి. వీటితో పాటు పలు పాటలను పాడి ఆకట్టుకున్నారు. మరికొన్ని పాటలు సభికుల మన్ననలు పొందాయి. ఔత్సాహిక గాయకులు వేణుగోపాల్, విశ్వనాథ్, శుభ, కాశీనాథ్, విద్యాధరి, నారాయణ, విజయరావు, రాఘవేంద్రచారి, చిలువేరి శ్రీనివాస్ తదితరులు పాటలు పాడి ఆహుతులను రంజింపజేశారు.

క్రీడా ప్రాంగణంలో జొన్న చేను

క్రీడా ప్రాంగణంలో జొన్న చేను ఏమిటని ఆశ్చర్యపోతున్నారా..? అవును నిజమే. ఇక్కడ కేవలం బోర్డుకు మాత్రమే క్రీడా ప్రాంగణం పరిమితమైంది. ఎలాంటి ఆట వస్తువులు లేకపోవడంతో ఓ రైతు డ్రిప్ పరికరాలు అమర్చి, జొన్న సాగు చేస్తున్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని మస్తీపురం క్రీడా ప్రాంగణం పంటచేనుకు నిలయంగా మారింది.

– అమరచింత




ఎవరితో కలిసినా.. ఎవరిని వదిలేసినా.. ఏం చేసినా

నా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలు

చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు 'రాష్ట్రం' ముసుగు

- పవన్, బీజేపీ, కాంగ్రెస్... ఎవరితో కలిసినా, విడిపోయినా ఇదే మాట
- స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నక్కజిత్తులు
- 1999తో వాజ్ పేయితో కలిసినప్పుడు రాష్ట్ర హితం కోసమేనంటూ హడావుడి
- విడిపోయాక మతతత్వ పార్టీతో కలిసి తప్పు చేశానని పశ్చాత్తాపం
- 2014లో పాజిటివ్ ఓటు కోసం మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలంటూ బీజేపీతో పొత్తు
- 2019లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విడిపోయానంటూ డాంబికాలు
- మళ్లీ ఇపుడు రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో కలిసే ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు
- ప్రత్యేక హోదా సంజీవని కాదు.. ప్యాకేజీ చాలన్నప్పుడు కూడా ఇదే మాట
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడూ... ప్రజాస్వామ్యం కోసమేనని ప్రచారం
- ఆఖరికి మద్య నిషేధం ఎత్తివేసినపుడు కూడా అదే ముసుగు
- బాబు ఏం చేసినా 'రాష్ట్ర ప్రయోజనాల' కోసమేనంటూ ఎల్లో మీడియా దరువు
- వాస్తవానికి అధికారం, కుటుంబ ప్రయోజనాలు తప్ప ఏవీ పట్టని బాబు
- తనయుడి కోసం, అధికారం కోసం ఏం చేయటానికైనా నారా వారు రెడీ



(సాక్షి, అమరావతి)

ఈ మధ్య 'శరణు... శరణు' అంటూ బీజేపీతో పొత్తులు కుదుర్చుకోవటానికి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లినపుడు ఎల్లో మీడియా మొత్తం ఒకటే రచ్చ. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకి వెళ్లారని, రాష్ట్ర హితం కోసం కాస్త తగ్గి అయినా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్నది ఆయన ఉద్దేశమని!!. మరో పచ్చపత్రిక హద్దులన్నీ దాటేసి.. నారా వారు గెలవటం రాష్ట్రానికి చారిత్రక అవసరమని తేల్చిచెప్పేసింది!.

ఒక్కటి మాత్రం నిజం. జనం నవ్విపోతారన్న సిగ్గు బాబుకు, ఆయన మీడియాకు కాస్తయినా లేదు. ఎన్ని పనికిమాలిన పనులు చేసినా, ఎన్ని అపవిత్ర పొత్తులు పెట్టుకున్నా.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని జనాన్ని నమ్మించడానికి బాబు, ఆయన ముఠా నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారంటే... ఎవ్వరినైనా మేనేజ్ చేయగలమన్న వీళ్ల తెంపరితనమే కారణమనుకోవాలి.

నీచపు ఎత్తుగడల్లో వేరెవ్వరికీ సాధ్యం కాని చారిత్రక ట్రాక్ రికార్డు చంద్రబాబు నాయుడిది. ఎందుకంటే ఆయన ఇప్పటిదాకా భారతీయ జనతా పార్టీతో రెండు సార్లు కలిశారు... రెండు సార్లు విడిపోయారు. మళ్లీ మూడోసారి కలవటానికి కాళ్ల బేరంతో సహా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారిపుడు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోనూ ఇలాంటి బంధమే. 2014లో కలిశారు... 2019లో విడిపోయారు. మళ్లీ ఇపుడు కలిసిపోయారు. ఆఖరికి తన జన్మ విరోధి కాంగ్రెస్‌తోనూ 2019 తెలంగాణ ఎన్నికల్లో ప్రత్యక్ష పొత్తు పెట్టేసుకున్నారు. ఈ సారి మాత్రం తెలంగాణతో పాటు ఏపీలోనూ పరోక్ష పొత్తుతో లాగిస్తున్నారు. ఇవన్నీ చూస్తే ఎవ్వరికైనా ''ఛీ.. అధికారం కోసం మరీ ఇంతలా దిగజారిపోవాలా?'' అనిపించకమానదు. కానీ బాబు పెంచి పోషిస్తున్న ఎల్లో మీడియా మాత్రం దీన్ని మరో కోణంలో చూపించడానికి ప్రయత్నిస్తోంది. ఎప్పటికప్పుడు బాబు చేసిన లాంటి దిగజారుడు పనులన్నిటికీ 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే' అనే ముసుగు వేస్తోంది. ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హితం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బాబు ఇవన్నీ చేశారనే కలర్ ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. బాబు కూడా.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో కలిసే ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ నేతల సమావేశంలో చెప్పొచ్చారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన సొంత ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆయన రాష్ట్రం కోసం, ప్రజల కోసమే తీసుకున్న నిర్ణయాలుగా వివరించే ప్రయత్నాన్ని చూసి పార్టీ నేతలే నివ్వెరపోవాల్సి వచ్చిందని సమాచారం.

ఆది నుంచి స్వప్రయోజనాలే పరమావధి...

కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన చంద్రబాబు... ఆ పార్టీ ఓడిపోవటంతో, దానికి బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అల్లుడు కాబట్టి చేర్చుకోవాల్సి వచ్చింది నాటి తెలుగుదేశాధిపతి ఎన్టీఆర్‌కు. ఆ తరవాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కుని.. ఇదంతా ప్రజాస్వామ్యాన్ని బతికించడానికే చేశానని నాటి తన ఎల్లో మీడియా సాయంతో చెప్పగలిగారు చంద్రబాబు. నిజాలు అందరికీ తెలిసినా... ఇప్పటికీ అదే అబద్ధాన్ని పదేపదే చెబుతూ ఉంటారు చంద్రబాబు. ఆ రోజు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే అలా చేయాల్సి వచ్చిందంటుంటారు. తన చెంచాలతో చెప్పిస్తుంటారు కూడా. ఇక 1999లో బీజేపీకి ఉన్న పాజిటివ్ ఓటు సాయంతో రాష్ట్రంలో గట్టెక్కవచ్చని భావించి... ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని విజయం సాధించారు. బీజేపీతో అధికారాన్ని పంచుకుని కేంద్రంలో చక్రం తిప్పినట్లు మహా బిల్డప్ ఇచ్చి ఇప్పటికీ దాని గురించి చెప్పుకుంటూనే ఉంటారు.

మళ్లీ బీజేపీతో జట్టుకట్టేశారు...

కానీ 2004 ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోంది. అది తనమీదా పడొచ్చనే భయంతో ఆ పార్టీతో తెగ తెంపులు చేసుకుని బయటకు వచ్చేశారు. దాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో... బీజేపీ మతతత్వ పార్టీ అని, ప్రజాస్వామ్యానికి-లౌకిక తత్వానికి ప్రమాదకరమని ఆరోపణలు చేశారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశానని పశ్చాత్తాపం నటించారు. విచిత్రమేంటంటే రాష్ట్రాన్ని విభజించాలని కోరుతున్న టీఆర్‌ఎస్‌తో 2009 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నారు. టీఆర్‌ఎస్, వామపక్షాలతో కలిసి మహాకూటమిగా ఏర్పడి అప్పట్లో దానిక్కూడా రాష్ట్ర ప్రయోజనాలనే ముసుగు వేసినా... ప్రజలు తిప్పికొట్టారు. ఇక 2014 ఎన్నికల్లో మోడీ హవా కొనసాగుతుండడంతో... మళ్లీ బీజేపీ పంచన చేరి, రాష్ట్ర ప్రయోజనాల కోసం తప్పలేదంటూ సమర్థించుకున్నారు. అప్పుడు కూడా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారాన్ని పంచుకుని రాష్ట్రంలో చెలరేగిపోయారు. దోచుకో-పంచుకో-తినుకో అనే రీతిలో సహజ వనరులన్నిటినీ కొల్లగొట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తన అధికార భాగస్వామిని అడగకుండా... హోదా ఏమీ సంజీవని కాదు కదా? హోదా వస్తే అన్ని సమస్యలూ పోతాయా? అని ఎదురు ప్రశ్నించారు. కేంద్రంతో లాలూచీ పడి, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలన్నారు. పోలవరాన్ని కేంద్రం నిర్మిస్తానని చెప్పినా... కమీషన్ల కోసం ఆ బాధ్యత తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. బాబు కమిషన్ల యావను అర్థం చేసుకున్న బీజేపీ... ప్రత్యేక ప్యాకేజీ పేరిట డబ్బు మూటలు పంపి చేతులు దులుపుకొంది. హోదాను పక్కనబెట్టేసింది.

హోదా వద్దని... మళ్లీ దానికోసం డ్రామా

2019 ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనాతో చంద్రబాబు చెలరేగిపోయారు. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో జత కట్టారు. తనకు భార్య, కొడుకు, మనవడు ఉన్నారని.. మోదీకి ఎవరున్నారని, అసలు మోదీ ఎవరని ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా నాటి ప్రధానిని దూషించారు. తిరుపతికి వచ్చిన అమిత్‌షాపై తన మనుషులతో రాళ్లు వేయించారు. అంతేకాదు.. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా కోసం ఉద్యమించడంతో తాను కూడా హోదా డిమాండ్‌ను ఎత్తుకున్నారు. ప్యాకేజీకి అంగీకరించిన నోటితోనే హోదా కావాలని ఎలా అడుగుతారని జనం ప్రశ్నించినా.. అదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే చేశానంటూ నాలుక మడతేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయాక మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం పాకులాడి... తొలుత తన పార్టీలోని అనయాయులు కొందరిని ఆ పార్టీలోకి పంపేశారు. వారి సాయంతో ఇపుడు బీజేపీ అగ్ర నేతల కాళ్లావేళ్లా పడి ఎలాగైనా ఆ పార్టీతో కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని చెబుతున్నారు.

మద్య నిషేధానికీ ఇదే ముసుగు..

చంద్రబాబువి ఎంత దుర్మార్గపు పనులో... దాన్ని ఎల్లో మీడియా ఎలా కవర్ చేస్తుందో తెలియటానికి మద్య నిషేధాన్ని చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1994లో అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తన మాట ప్రకారం... 1995 జూన్ నుంచీ సంపూర్ణ మద్య నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కానీ ఆయన్ను వెన్నుపోటు పొడిచి 1996లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు... నిండా ఏడాది కూడా గడవక ముందే నిషేధాన్ని ఎత్తివేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం విచ్చలవిడిగా వస్తోందంటూ... దానివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, రాష్ట్ర హితం కోసం నిషేధాన్ని ఎత్తివేయక తప్పడం లేదని చెప్పి మళ్లీ మద్యాన్ని తెచ్చేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం వస్తుంటే అడ్డుకోవాలి గానీ, నిషేధాన్ని ఎత్తివేయటమేంటని వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ జవాబుల్లేవు మరి!!. ఆయన జవాబివ్వనిది కూడా... రాష్ట్ర ప్రయోజనాల కోసమేనేమో!!.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీమనోహర్ తదితరులు

కులాల సమగ్ర గణన జరపాల్సిందే

- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- బీసీ కేటగిరీల్లో కులగణన జరిపితే బీసీలకు అత్యంత నష్టం
- జనాభాలో ఉన్న కులాల సంఖ్య తెలియకుండా గణన అసాధ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల సమగ్ర గణన జరపాలని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ డిమాండ్ చేసింది. కేవలం బీసీ వర్గంలోని కులాలను మాత్రమే గణిస్తే అది బీసీ సామాజికవర్గానికి అత్యంత ప్రమాదకారి కానుందని ఆందోళన వ్యక్తం చేసింది. అన్నికులాల గణనపైన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే క్షేత్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు వెనుకాడమని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ తేల్చిచెప్పింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

కులగణన చేపట్టాలి

ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కులగణన చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థలకు ఉందన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టి సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించడం, కేబినెట్ సమావేశంలో ఈమేరకు ఆమోదించడం శుభపరిణామమన్నారు. కానీ కులగణన కేవలం బీసీ కులాలకు మాత్రమే పరిమితం చేస్తామంటూ అధికారవర్గాలు చెబుతున్నాయని, అలా బీసీ కులగణన చేపడితే వెనుకబడిన వర్గాలు అత్యంత ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బీసీ కులగణన అనేది శాస్త్రీయంగా సరికాదని, బీసీ కులానికి చెందిన వారి ఇంటికే వెళ్లి సర్వే చేయడంతో ఇతర కులాల గణాంకాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. జనాభాలో ఏయే కులాలు ఎంత సంఖ్యలో ఉన్నాయో తెలిస్తేనే కులాల వారీగా వాటా స్పష్టమవుతుందని చెప్పారు. ఈ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని స్పష్టత ఇవ్వాలన్నారు.

మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కులగణన ప్రక్రియ చేపట్టే ముందు రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల్లోని మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. న్యాయపరమైన అంశాలు చర్చకు వస్తాయని, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కార్యాచరణ చేసుకునే వీలుంటుందని చెప్పారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేపట్టడమే రాష్ట్ర ప్రభుత్వం ఎజెండాగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎంకు మరోమారు నివేదిస్తాం

ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ సమగ్ర కులగణన కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మరోమారు నివేదిస్తామన్నారు. ఇదివరకు సీఎంను కలిసినప్పుడు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడాలని, ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం ఆదేశించినా, ఇంకా నిర్వహించలేదని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వివరించారు.

అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు

- మాజీ మంత్రి చిన్నారెడ్డి



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రెండు నెలల్లోనే జీవో నం.14 ద్వారా అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం 8న పరిపాలన అనుమతులు జారీ చేసిందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు రూ.2,945 కోట్లను కేటాయించారని, దీని ద్వారా కొడంగల్, నారాయణపేట, మక్తల్ ప్రాంతాలకు సాగునీళ్లు అందనున్నాయని చెప్పారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో పాలమూరు ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ఫీడ్ చానల్స్, ఇరిగేషన్ ఛానల్స్ పూర్తయితే నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వనుందన్నారు. జూరాల సోర్సుగా సాగునీళ్లు ఇవ్వడం చాలా సులువైనప్పటికీ గత ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించిందన్నారు. పాలమూరులో 9 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ నాశనం చేసి, రంగారెడ్డికి నీళ్లు పోకుండా ప్రాజెక్టు సార్థకతను ప్రశ్నార్థకం చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టు పనులను ఉద్దండాపూర్ వరకు చేపట్టి వదిలేశారని, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును విస్మరించారని మండిపడ్డారు. ఫేజ్- 1 పటిష్టం చేసి, ఫేజ్- 2 మెరుగుపరిచితే రంగారెడ్డి జిల్లాలోని పరిగి, చేవేళ్ల, వికారాబాద్‌లకు భవిష్యత్‌లో నీళ్లు అందుతాయన్నారు. వైశాల్యంలో పెద్దదైన పాలమూరు జిల్లాలో దక్షిణాన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్యారాలాల్ కెనాల్ పోతోందని, ఉత్తరాన జూరాల సోర్సుగా పాలమూరు- రంగారెడ్డి తీసుకుని ఉంటే మహబూబ్‌నగర్ సరిహద్దు దాటి రంగారెడ్డి జిల్లా వరకు పోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలో తెలంగాణలోని ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ఉన్న వెనక్కి తగ్గిందని అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పాలమూరుకు 60 శాతం నిధులు ఇవ్వాల్సి ఉందని, ఎందుకంటే గత ప్రభుత్వం లోనే 40శాతానికి పైగా 55వేల కోట్లల్లో 27వేల కోట్లు ఖర్చు పెట్టిందని, అధికంగా ఖర్చు పెట్టిన నిధులను సైతం కేంద్రం రీయంబర్స్ చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఖమర్‌మియ్యా, బాబా, దివాకర్, జానకీరాములు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఫిర్దోస్ తస్నిమ్ విశేష ప్రతిభ

- మొదట బాస్కెట్‌బాల్‌లో.. ఇప్పుడు క్రికెట్‌లో రాణింపు
- తొలిసారిగా జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ టోర్నీకి రాష్ట్రానికి ప్రాతినిథ్యం



తెలంగాణ బాలికల జట్టులో ఫిర్దోస్ తస్నిమ్ (వృత్తంలో)



ట్రోఫీతో ఫిర్దోస్ తస్నిమ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం రాజేంద్రనగర్ సద్దల్ గుండ్‌కు చెందిన ఫిర్దోస్ తస్నిమ్ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తోంది. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉన్న ఈమె పాఠశాల స్థాయి ఆటల్లో చురుగ్గా ఉండేది. 8వ తరగతి వరకు బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ చాటింది. పలు జిల్లా స్థాయి టోర్నీలతోపాటు మూడు రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిథ్యం వహించింది. ఫిర్దోస్ తస్నిమ్ జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

2019 నుంచి క్రికెట్‌లోకి ప్రవేశం..

ఫిర్దోస్ తస్నిమ్ తండ్రి రియాజుద్దీన్, అన్నయ్య అద్నానుద్దీన్ ఇద్దరు క్రికెట్ క్రీడాకారులు కావడంతో వారి ప్రోత్సాహంతో 2019లో క్రికెట్‌లో ప్రవేశించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్‌లో ఫిర్దోస్ విశేషంగా రాణించింది. అండర్-14 ఎస్‌జీఎఫ్ ఆదిలాబాద్‌లో, అండర్-17 గద్వాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఆడింది. గతేడాది కొత్తగూడెం అశ్వారావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్రస్థాయిలో ఆడింది. ఈ నెలలో సికింద్రాబాద్‌లో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ఆడింది. ఈ టోర్నీలో హైదరాబాద్‌పై 33 పరుగులు, రంగారెడ్డి జట్టుపై 25 పరుగులు, మెదక్ జట్టుపై 36 పరుగులు, వరంగల్ జట్టు 27 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది.

తొలిసారి జాతీయస్థాయి పోటీలకు

ఈమె మొదటిసారిగా జాతీయస్థాయి క్రికెట్ టోర్నీలో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జనవరి 11 నుంచి 14 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 క్రికెట్ టోర్నీలో పాల్గొంది. క్రికెట్‌లో రాణిస్తున్న ఈమెను రిషి జూనియర్ కళాశాల సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు అభినందించి సన్మానం చేశారు.

అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో ఆడుతా..

చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. తండ్రి, అన్నయ్య ప్రోత్సాహంతో క్రికెట్‌లో రాణిస్తున్న. మొదటిసారి జాతీయస్థాయి క్రికెట్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయస్థాయి క్రికెట్‌లో ఆడాలన్నదే తన లక్ష్యం. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తా. అదే విధంగా చదువులో కూడా డాక్టర్ కావాలన్నదే లక్ష్యం.

– ఫిర్దోస్ తస్నిమ్, క్రికెట్ క్రీడాకారిణి

కార్పొరేషన్ పదవులు కేటాయించాలి



మాట్లాడుతున్న వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించాలని, రాష్ట్రంలోని ఏడు పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని, లేబర్ జిల్లాగా ఉన్న పాలమూరు సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని, కేంద్ర రైల్వే శాఖ మాజీ మంత్రి మల్లికార్జున్ విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్, సంజీవ్‌ముదిరాజ్, నరహరి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, అశోక్, సంధ్యారాణి, మల్లేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

33వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఆత్మకూర్: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని వనపర్తి కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాములు, టీపీసీసీ రాష్ట్ర కల్లు గీత చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మూలమల్లలో దేశాయి సరళాదేవి, అక్కారెడ్డి క్రీడాప్రాంగాణంలో కబడ్డీ 33వ సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక నిర్వహించారు. క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. వనపర్తి జిల్లాలోని 14 మండలాల నుంచి 16 ఏళ్ల వయసు, 55 కేజీల బరువు ఉన్న క్రీడాకారులు పాల్గొన్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలికల జట్టులో ఖిల్లా ఘనపూర్, వనపర్తి, అమరచింత, ఆత్మకూర్, పెబ్బేరు మండలాల నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారని వివరించారు. అలాగే బాలుర జట్టుకు శ్రీరంగాపురం, పెబ్బేరు, ఆత్మకూర్, అమరచింత మండలాల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో దేశాయి సరళదేవి, కుర్మయ్య, వెంకట్రాములు, చంద్రశేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మోష, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, రాజు, సత్యన్న, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

క్రీడలతో మంచి గుర్తింపు

బాలానగర్: కష్టపడి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సమాజంలో గుర్తింపుతోపాటు మంచి సంపాదన లభిస్తాయని తిరుపతి, గణేష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం, ఆదివారం నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ రాష్ట్రస్థాయి మహిళా ముగింపు వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదుతోపాటు ట్రోఫీ బహూకరించారు. మహిళా క్రీడల్లో మొత్తం 9 జట్లు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్' స్కూల్ హకీంపేట్ టీం మొదటి బహుమతిగా రూ.30వేల నగదుతోపాటు, ట్రోఫీని దక్కించుకున్నారు. రన్నరప్‌గా నిలిచిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ టీం రూ.20వేల నగదుతోపాటు రన్నరప్ ట్రోఫీని, మూడో స్థానంలో నిలిచిన నల్లగొండ జట్టుకు రూ.10 వేల నగదుతోపాటు జ్ఞాపికలను అందుకున్నారు.



మహిళా విభాగంలో మొదటి బహుమతి అందుకున్న జట్టుకు ట్రోఫిని అందిస్తున్న నిర్వాహకులు

పురుషుల విభాగంలో ఉమ్మడి పాలమూరు-రంగారెడ్డి జిల్లాల క్రీడలు కొనసాగుతున్నాయి. మొత్తం 35 జట్లు పాల్గొనగా ఆదివారం రాత్రి వరకు కొనసాగాయి.

పార్లమెంట్ టికెట్ బీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న కోట్ల కిశోర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్‌ను బీసీ నాయకుడైన శాంతి కుమార్‌కే కేటాయించాలని ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోట్ల కిశోర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సహకారం కోసం జరిగిన పోరాటంలో ఓబీసీలు కీలకంగా పోరాటం చేశారన్నారు. జనాభా దామాషా ప్రకారం 70 శాతం బీసీలు ఉన్నప్పటికి మాకు రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మిగిలి పోయిందన్నారు. మా ఆత్మగౌరవం రాజ్యాధికారం సాధన కోసం ఎత్తిన పిడికిలిని దించమని అన్నారు. బీసీలు దశాబ్దాల నుంచి రాజ్యాధికారం కోసం పల్లకీలు మోయడమే తప్పా పల్లకీఎక్కే దిశగా బీసీలు ప్రయత్నాన్ని కొన్ని సామాజిక వర్గాలు వమ్ము చేస్తున్నాయని ఆరోపించారు. పది శాతం ఉన్న కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల ఆత్మగౌరవాన్ని, ఐక్యతను నిలబెట్టుకునే విధంగా ముందుకు వెళ్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు మాత్రమే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలో ఎంపీకి నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టంకరి శివప్రసాద్ యాదవ్, కాగితాల మధు, సబ్బి శివకుమార్, బోయ విజయ్, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో ప్రభుత్వ విద్య



మాట్లాడుతున్న జంగయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కొన్నేళ్లుగా ప్రభుత్వ విద్య పూర్తి సంక్షోభంలో కూరుకుపోయిందని, ఇప్పటికైన విద్య వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరముందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ చేసిన పోరాటాల కారణంగా బదిలీలు, పదోన్నతులు ప్రభుత్వం చేపట్టిందన్నారు. కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందని, కొత్త ప్రభుత్వం వాటిని పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందని, కొఠారి కమిషన్ జీడీపీలో కనీసం 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కిష్టయ్య, వెంకటేష్, రవికుమార్, ఉమాదేవి, మన్యం, రాములు, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.